# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 17-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సౌదీ అరేబియాలో ఈరోజు తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 42 మంది భారతీయ యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు.
- ❖ ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025లో పతకాలు సాధించిన భారత ఆర్చరీ జట్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు.
- ❖ నాణ్యత లేని విత్తనాల అమ్మకాలను అరికట్టేందుకు రాబోయే బడ్జెట్ సమావేశాల్లో నూతన విత్తన చట్టాన్ని ప్రవేశపెడతామని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు.
- ❖ భారతదేశ పురోగతికి అడ్డంకులు సృష్టించాలని చూస్తే అందుకు తగిన చర్యలు తీసుకోవడానికి భద్రతా దళాలు సిద్ధంగా ఉన్నాయని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు.

==========================

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. సౌదీ అరేబియా ప్రభుత్వ అధికారులతో భారత ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం జెడ్డాలోని కాన్సులేట్ కావాల్సిన సహాయం అందిస్తున్నాయని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. యాత్రికులతో వెళ్తోన్న బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకోగా మొత్తం 42 మంది భారతీయ యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకరమైన ప్రమాదంలో హైదరాబాద్ కు చెందిన నసీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మృతి చెందారు. నసీరుద్దీన్ తన కుటుంబ సభ్యులతో కలిసి మక్కా యాత్రకు వెళ్లగా ఈ ఘోర ప్రమాదం వారి కుటుంబాన్ని కబళించింది. బాధిత కుటుంబ బంధువులను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సంతాపం తెలిపింది. బాధిత కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా ఆర్చరీ ఛాంపియన్ షిప్ -2025లో 6 స్వర్ణాలు సహా 10 పతకాలతో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత ఆర్చరీ జట్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. 18 సంవత్సరాల తర్వాత రీకర్వ్ పురుషుల విభాగంలో బంగారు పతాకం సాధించడంపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. వ్యక్తిగత ఈవెంట్స్ లో హోరా హోరీగా సాగిన పోరాటాలు, విజయవంతమైన కాంపౌండ్ టైటిల్ డిఫెన్స్‌లను కూడా ప్రధానమంత్రి ప్రశంసించారు. ఈ అద్భుతమైన విజయం దేశవ్యాప్తంగా ఉన్న అనేక మంది ఆశావహ అథ్లెట్లకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నాణ్యత లేని విత్తనాల అమ్మకాలను అరికట్టేందుకు రాబోయే బడ్జెట్ సమావేశాల్లో నూతన విత్తన చట్టాన్ని ప్రవేశపెడతామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. ముంబైలో ఈరోజు జరిగిన ఆసియన్ సీడ్ కాంగ్రెస్-2025 ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... ఉద్యానవన పంటలకు నాణ్యమైన నాట్లు వేసే సామగ్రిని అందించేందుకు మహారాష్ట్రలో క్లీన్ ప్లాంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాతావరణ అనుకూల అధిక-నాణ్యత గల విత్తనాలపై దృష్టి పెట్టాలని, పప్పుధాన్యాలు నూనెగింజల ఉత్పత్తిలో భాగస్వామ్యాన్ని పెంచాలని విత్తన పరిశ్రమను కేంద్రమంత్రి ఈ సందర్భంగా కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదులు వారి మద్దతుదారులను భారత్ ఒకేలా చూస్తుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకొన్న ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇస్తే అది పొరుగు దేశానికే నష్టమని హెచ్చరించారు. దేశ ప్రజల శ్రేయస్సుపైనే భారత్ ప్రధానంగా దృష్టి పెడుతుందని, ఆ మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టించాలని చూస్తే అందుకు తగిన విధంగా ప్రతిస్పందిస్తామన్నారు. న్యూ ఢిల్లీలో ఈరోజు జరిగిన 'చాణక్య డిఫెన్స్ డైలాగ్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 88 గంటల పాటూ భారత త్రివిధ దళాలు చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ కేవలం ట్రైలర్ మాత్రమేనని చెప్పారు. భారత్ ఎలాంటి బెదిరింపులకు లొంగదని, భారత పురోగతికి అడ్డంకులు సృష్టించాలని చూస్తే అందుకు తగ్గ చర్యలు తీసుకోవడానికి భద్రతా దళాలు సిద్ధంగా ఉన్నాయని ఉపేంద్ర ద్వివేది హెచ్చరిస్తూ..

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా నుంచి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి) ని దిగుమతి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఏడాది కాలానికి సంబంధించిన ఒప్పందంపై సంతకం చేశాయి. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖా మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడిస్తూ.. ఆయా సంస్థలు సంవత్సరానికి 2.2 మిలియన్ టన్నుల ఎల్.పి.జి.ని దిగుమతి చేసుకుంటాయని అమెరికా గల్ఫ్ కోస్ట్ నుండి దీనిని సేకరిస్తామని చెప్పారు. పౌరులకు సురక్షితమైన, సరసమైన ఎల్.పి.జి. సరఫరాను అందించేందుకు ప్రభుత్వం తన ఎల్.పి.జి. నిల్వలను వైవిధ్యపరుస్తోందన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ పీసీఎల్) అధికారుల బృందం గత కొన్ని నెలలుగా అమెరికా సందర్శించి, ప్రధాన యు.ఎస్. చమురు ఉత్పత్తిదారులతో చర్చలు జరిపారని హర్దీప్ సింగ్ పూరి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, న్యూజిలాండ్  దేశాల మధ్య సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చించేందుకు న్యూజిలాండ్ వాణిజ్య శాఖా మంత్రి టాడ్ మెక్ క్లే ఈరోజు భారత్ కు చేరుకున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్‌తో ఉన్నత స్థాయి ద్వైపాక్షిక చర్చలు నిర్వహించేందుకు ముంబై నగరానికి వచ్చిన టాడ్ మెక్ క్లే విలేకరులతో మాట్లాడుతూ.. ఇరు దేశాలు వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సహకారాన్ని పెంచే లక్ష్యంతో చర్చలను ముందుకు తీసుకెళ్లడంపై ఆసక్తితో ఉన్నాయని చెప్పారు.

(వాయిస్ 23 సెకన్లు)

కాగా పీయూష్ గోయల్ కొద్ది రోజుల క్రితం జరిపిన న్యూజిలాండ్ పర్యటనలో భారత్-న్యూజిలాండ్ FTA చర్చల నాల్గవ రౌండ్ సానుకూలంగా ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షత హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉత్తర జోనల్ కౌన్సిల్ సమావేశం ఈరోజు జరిగింది. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఢిల్లీ ఎర్రకోట పేలుడు బాధితులకు నివాళులు అర్పిస్తూ.. సమావేశంలో ఒక క్షణం మౌనం పాటించారు. రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం, నీటి పంపిణీ సమస్యలు, అభివృద్ధి పనులపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నేతృత్వంలోని పార్లమెంటు సభ్యుల సంప్రదింపుల కమిటీ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా పిన్నాపురంలో ఉన్న గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యుబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ను ఈరోజు సందర్శించింది. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను వేగవంతం చేయడంపై దృష్టి సారిస్తూ.. కేంద్ర మంత్రి అధ్యక్షతన ఆరవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత్ ఇప్పుడు మిగులు విద్యుత్ దేశంగా మారిందన్నారు. అయినప్పటికీ ఇంకా చాలావరకు పునరుత్పాదక శక్తి వినియోగంలో లేదన్నారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు అదనపు గ్రీన్ పవర్‌ను నిల్వ చేయగలవని, సౌరశక్తి లేని సమయాల్లో విద్యుత్ ను అందించగలవని పేర్కొన్నారు. పునరుత్పాదక సామర్థ్యం పెరిగే కొద్దీ గ్రిడ్‌ను సమతుల్యం చేయడానికి ఇది చాలా కీలకమన్నారు. స్థల కేటాయింపు, నీటి అనుమతులను వేగవంతం చేయాలని కేంద్రమంత్రి రాష్ట్ర ప్రభుత్వాలను ఈ సందర్భంగా కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్, కేరళ, మాహేలలో రాబోయే రెండు రోజుల పాటూ భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. ఇక ఛత్తీస్‌గఢ్, మధ్య మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, జార్ఖండ్, రాజస్థాన్ లలో రేపు చలిగాలులు కొనసాగుతాయని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84 వేల 562 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరకు 388 పాయింట్లు లాభపడి 84 వేల 950 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 103 పాయింట్లు పెరిగి 26 వేల 013 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 64 పైసలుగా ఉంది.